క్లుప్తంగా

బాణసంచా గోడౌన్ తనిఖీ



బాణసంచా గోడౌన్ను పరిశీలిస్తున్న తహసీల్దార్

కొండపి: మండలంలోని చిన్న కళ్లగుంట గ్రామం వద్ద ఉన్న బాణసంచా గోడౌన్ను శుక్రవారం తహసీల్దార్ పి.మురళి తనిఖీ చేశారు. గోడౌన్లోని ఏర్పాట్లపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీపావళి సందర్భంగా వినియోగదారులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా విక్రయాలకు ఏర్పాట్లు చేయాలని, బారికేట్లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. గోడౌన్ వద్ద రేకులతో కూడిన టెంట్లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఇసుకను, సిలిండర్లను, అందుబాటులో ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో కొండపి ఫైర్ అధికారి సీహెచ్ వెంకటరావు, ఫైర్ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

28 నుంచి శనగ విత్తనాల రిజిస్ట్రేషన్

కొండపి: మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో ఈ నెల 28 చి సబ్సిడీపై సెనగ విత్తనాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమవుతుందని వ్యవసాయాధికారి డి.విజయ్‌కుమార్ అన్నారు. విత్తనాలు కావాల్సిన రైతులు ఆధార్ కార్డు, పొలం పాసుపుస్తకం, ఫోన్ నంబర్‌తో రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.

నేడు సామాజిక తనిఖీ ప్రజావేదిక

పామూరు: మండలంలోని 25 గ్రామ పంచాయతీల పరిధిలో 2023–24 ఆర్థిక సంవత్సరాల్లో జరిగిన ఉపాధి హామీ పథకం పనుల సామాజిక తనిఖీ ప్రజావేదిక శనివారం ఉదయం 10 గంటలకు స్థానిక మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ బి.సురేష్ తెలిపారు. సమావేశానికి పంచాయతీల సర్పంచ్‌ల, పీఏ స్‌లు, సంబంధిత అధికారులు హాజరు కావాలని కోరారు.

అంగన్‌వాడీ కేంద్రాలను పరిశుభ్రంగా ఉంచాలి

కనిగిరి రూరల్: అంగన్‌వాడీ కేంద్రాలు, పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని ఐసీడీఎస్ సూపర్ వైజర్ ఎంపీఎస్ పార్వతి అన్నారు. మండలంలోని లింగారెడ్డిపల్లిలో గురువాజీపేట సెక్టార్ సమావేశం శుక్రవారం నిర్వహించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో సూపర్ వైజర్ పార్వతీ మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన ప్రీ స్కూల్ టైం టేబుల్ గూర్చి వివరించారు. వర్షాల ప్రభావం వల్ల ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున పిల్లల పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సెక్టార్ లీడర్లు రాజ్యలక్ష్మి, భాగ్యలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు టీటీడీ కల్యాణ మండపానికి శంకుస్థాపన

సింగరాయకొండ: టీటీడీ ఆధ్వర్యంలో పురాణ ప్రసిద్ధి చెందిన పాతసింగరాయకొండ వరాహా లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం ప్రాంగణంలో సుమారు రూ.2 కోట్ల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న కల్యాణ మండపానికి శనివారం శంకుస్థాపన చేయనున్నట్లు ఆలయ ఈఓ పి.కృష్ణవేణి ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

మైక్రో ఇరిగేషన్‌ను సద్వినియోగం చేసుకోవాలి

మర్రిపూడి: అగ్రికల్చర్ మైక్రో ఇరిగేషన్‌ను ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని అగ్రికల్చర్ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ పీవీ రమణ తెలిపారు. శుక్రవారం ఆయన మర్రిపూడి వచ్చిన సందర్భంగా రైతులతో మాట్లాడుతూ ప్రభుత్వ రైతులకు 90శాతం సబ్సిడీపై డ్రిప్‌లు అందిస్తుందన్నారు. అలాగే స్ప్రింకర్లు, మైక్రో స్ప్రింకర్లు 50 శాతం సబ్సిడీపై అందిస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఆయన వెంట ఎస్‌కే ఇమ్రాన్, ధర్మ, సుజాత, శివరాజు ఉన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

సీఎస్‌పురం(పామూరు): రాష్ట్రస్థాయి నెట్‌బాల్, త్రోబాల్ పోటీలకు సీఎస్‌పురం జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు ఎంపికయ్యారు. ఈసందర్భంగా పాఠశాల హెచ్‌ఎం షేక్.ఖాదరున్నీసాబేగం మాట్లాడుతూ శుక్రవారం సింగరాయకొండ ప్రభుత్వ కళాశాలలో జరిగిన జిల్లాస్థాయి నెట్‌బాల్‌లో తమ పాఠశాలకు చెందిన పోటీల్లో విష్ణు, హరి, త్రోబాల్ పోటీల్లో గౌతమ్, దీపక్‌లు జిల్లాస్థాయిలో రాణించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు.

వాణిజ్య పంటలు సాగు చేయండి

జరుగుమల్లి(సింగరాయకొండ): ప్రజల అవసరాల కోసం పొగాకు సాగు తగ్గించి వాణిజ్య పంటలైన అపరాలు, చిరు ధాన్యాల సాగు చేయాలని వ్యవసాయాధికారి యుగంధర్‌రెడ్డి అన్నారు. జరుగుమల్లి మండలం పంగులూరివారిపాలెంలో శుక్రవారం ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయాధికారి యుగంధర్‌రెడ్డి మాట్లాడుతూ వాణిజ్య పంటల సాగు వలన ప్రజల ఆహార అవసరాలు తీరటంతో పాటు అధిక లాభాలు సమకూరుతాయని వివరించారు.

అదమరిస్తే అంతే..!

- భారీ గుంతలు పడిన లో లెవల్ బ్రిడ్జి
- వేగంగా వెళ్తూ గుంతను గమనించకపోతే ప్రమాదమే
- బ్రిడ్జిపై గుంతలు పూడ్చాలంటున్న ప్రయాణికులు
- పట్టించుకోని అధికారులు, పాలకులు



గుంతలు పడి ప్రమాదకరంగా ఉన్న మన్నేరు బ్రిడ్జి రోడ్డు

కందుకూరు రూరల్:

మండలంలోని మాచవరం వద్ద మన్నేరుపై ఉన్న లో లెవల్ బ్రిడ్జి రోడ్డు అధ్వానంగా మారింది. పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. బ్రిడ్జిపై అంతా సిమెంటు రోడ్డు కావడంతో గుంతలు ఏర్పడ్డాయి. వాహనదారులు గుంతలను గమనించకుండా వేగంగా వాహనం నడిపితే గుంతలో పడి ప్రమాదాలు జరుగుతున్నాయి. వాహనాలు కూడా పాడవుతున్నాయి. గుంతల్లో టైరు పడితే పంక్చర్లు అవుతున్నాయి. పాత టైరు అయితే లోపల ట్యూబు నలిగిపోతోంది. అదే ట్యూబ్ లెస్ టైరు అయితే రిమ్ము వంగిపోయి గాలిపోతోంది. ఈ మధ్య కాలంలో అనేక మంది వాహనదారులు ఇలాంటి ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దగ్గరకు వెళ్లే వరకు ఆ గుంతలు కనిపించడం లేదు. వాహనదారులు గుంతల దగ్గరికి వెళ్లినప్పుడు పక్కకు తిప్పేందుకు కూడా మార్జిన్ ఉండటం లేదు. ఒకవేళ గుంతల నుంచి పక్కకు వెళ్లాలంటే మన్నేరులో వాహనాలు పడే అవకాశం ఉంది. దీంతో వాహనదారులు గుంతల్లోనే వాహనాలను దింపి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎక్కువగా ద్విచక్ర వాహనదారుల టైర్లు దెబ్బతింటున్నాయి. వెంటనే మాచవరం గ్రామంలో పంక్చర్ షాపుల వారికి ఫోన్లు చేసి బ్రిడ్జి మీదే పంక్చర్ వేయించుకుని వెళ్తున్నారు. ఈ రోడ్డుపై గుంతల వలన పంక్చర్ షాపులకు గిరాకీ పెరిగింది. ప్రతిరోజూ ఏదో ఒక వాహనం పంక్చర్ పడుతోందని గ్రామస్తులు చెబుతున్నారు. ఆటోలు, నాలుగు చక్రాల వాహనదారులు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ బ్రిడ్జిపై నుంచి కందుకూరు, గుండ్లపాలెం, దారకానిపాడు, రాళ్లపాడు, పెదపవని, చినపవని, గుడ్లూరు, తెట్టు, కావలికి నిత్యం వాహనదాలు తిరుగుతుంటాయి. రోజూ తిరిగేవారు అదమరిచినా, కొత్తగా వచ్చేవారు వేగంగా వాహనాలు నడిపి గుంతలను గమనించకున్నా బ్రిడ్జిపై ప్రమాదానికి గురికాక తప్పదు. అదృష్టవశాత్తూ ప్రయాణికులకు దెబ్బలు తగలకపోయినా వాహనానికి రిపేరు మాత్రం తప్పదు. అయినప్పటికీ అధికారులు, పాలకులు మాత్రం పట్టించుకున్న దాఖలాలు లేవని ప్రయాణికులు విమర్శిస్తున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి బ్రిడ్జి రోడ్డుపై ఉన్న గుంతలు పూడ్చాలని కోరుతున్నారు.



ఓవీ రోడ్డుపై గుంతలను కంకర్‌తో పూడ్చి మరమ్మతులు చేపట్టిన దృశ్యం

ఓవీ రోడ్డుపై గుంతలు పూడ్చివేత

సాక్షి ఎఫెక్ట్..

పొన్నలూరు: కందుకూరు నుంచి ముత్తరాసుపాలెం వరకు ఓవీ రోడ్డు సుమారుగా 8 కిలోమీటర్ల దూరం ఉంటుంది. అయితే దారి పొడవున రోడ్డు మధ్యలో మూడు, నాలుగు అడుగుల వెడల్పుతో అడుగు మేర లోతుతో గుంతలు ఏర్పడాయి. అలాగే ఇటీవల కురిసిన వర్షానికి ముత్తరాసుపాలెం సమీపంలోని ఆంజనేయస్వామి గుడి దగ్గర ఇలా మూడు చోట్ల రోడ్డు పూర్తిగా దెబ్బతిని భారీగా గుంతలు ఏర్పడి రోడ్డు రూపం కోల్పోయింది. దీంతో రోడ్డు సరిగా లేకపోవడంతో ఈ ప్రాంతంలో ప్రమాదాలు జరుగుతూ ప్రజల ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి. దీంతో గత నాలుగు నెలలుగా అధ్వానంగా ఉన్న ఓవీ రోడ్డును పాలకులు, అధికారులు ఎవరూ పట్టించుకోకపోవడంతో మంగళవారం సాక్షి పత్రికలో ×అడుగడుగునా గుంతలు..గుప్పెట్లో ప్రాణాలు¤ అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిక స్పందించిన ఆర్‌అండ్‌బీ అధికారులు గురువారం రాత్రి కంకరతో గుంతలను పూడ్చి రోలింగ్ తిప్పి మరమ్మతులు చేపట్టారు. దీంతో వాహనదారులు సాక్షిని అభినందిస్తూ హర్షం వ్యక్తం చేశారు.

శింగమనేనిపల్లి ఎస్సీకాలనీలో మాలల చైతన్య సభ



సభలో పాల్గొన్న నాయకులు, గ్రామ ప్రజలు

వలేటివారిపాలెం: మండలంలోని శింగమనేనిపల్లి ఎస్సీకాలనీలో రామాలయం గుడి వద్ద శుక్రవారం మాలల 54వ చైతన్య సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కట్ట శ్రీనివాసరావు అధ్యక్షత వహించగా, ఉమ్మడి ప్రకాశం జిల్లా ఉపాధ్యక్షుడు చిడితోటి శ్రీరాములు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ, క్రిమీలేయర్లు అమలు జరిగితే షెడ్యూల్ కులాలు నష్టపోతాయన్నారు. అలాగే రాజ్యాంగ పర్యవేక్షణ కోసం జాతి ప్రజలు క్రియాశీలకంగా అంబేడ్కర్ ఆలోచనలతో ఉద్యమాల్లో పాల్గొని ఫలితాలు సాధించేందుకు భాగస్వాములు కావాలన్నారు. అలాగే నవంబర్ 17న కందుకూరులో జరిగే హలో మాల.. చలో కందుకూరు, మాలలు మహాగర్జన బహిరంగ సభలో మండలంలోని మాలలంతా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో మాలల సంఘ జాయింట్ సెక్రటరీలు పొనుగోటి రామారావు, చల్లపల్లి బాబూరావు, సంఘ ఉపాధ్యక్షుడు బీరకాయల మాధవ తదితరులు పాల్గొన్నారు.


పార్టీ కార్యకర్తలకు ఆర్థికసాయం



:పార్టీ కార్యకర్తలను పరామర్శిస్తున్న దద్దాల

కనిగిరి రూరల్: వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో గాయపడి ఇంట్లో ఉన్న పార్టీ కార్యకర్తలను వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ శుక్రవారం పరామర్శించి రూ.40 వేలు ఆర్థిక సాయం చేశారు. మండలంలోని యడవల్లికి చెందిన గోపిశెట్టి చెన్నారావు, బరిగా బాల నరసింహులను పార్టీ ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్ ఇంటికెళ్లి పరామర్శించి, ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. గోపిశెట్టి చెన్నారావుకు రూ.10 వేలు, బరిగా బాల నరసింహారావుకు రూ.30 వేలు ఆర్థిక సాయం చేసి వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి, ఎస్సీ సెల్ నాయకులు కటికల వెంకట రత్నం, సర్పంచ్ గుంటూరి వెంకటేశ్వర్లు(బుల్లబ్బాయి), మాజీ సర్పంచ్ అల్లాటిపల్లి ప్రసాద్‌రెడ్డి, సిద్రారెడ్డి, బత్తుల మాలి యాదవ్, పొంకం యోగయ్య, కాసుల బాలయ్య, ఓంకారం, కూరేసు, మంత్రి గురవయ్య, అంబటి మోసే, గురుగులూరి ఆదిరెడ్డి పాల్గొన్నారు.

వైవీ సుబ్బారెడ్డిని కలిసిన చింతపల్లి



వైవీ సుబ్బారెడ్డితో చింతపల్లి హరిబాబు

టంగుటూరు: రాజ్యసభ సభ్యుడు, ఉమ్మడి గుంటూరు జిల్లా రీజనల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డిని వైఎస్సార్ సీపీ ప్రచార విభాగం జిల్లా అధ్యక్షుడు చింతపల్లి హరిబాబు శుక్రవారం తాడేపల్లి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. పలు విషయాలు చర్చినట్లు చింతపల్లి తెలిపారు.

ప్రతి విద్యార్థి ఆపార్ కార్డును పొందాలి



ఆధార్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న చైర్మన గఫార్

కనిగిరి రూరల్: ప్రతి విద్యార్థి ఆధార్ కార్డును అప్‌డేట్ చేసుకుని ఆపార్ కార్డు పొందాలని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. స్థానిక నాల్గవ వార్డులోని సచివాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ అప్‌డేట్ కేంద్రాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్ గఫార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వన్ నేషన్, వన్ స్టూడెంట్ నినాదంతో ప్రవేశపెట్టిన ఆపార్ కార్డ్‌ను ప్రతి విద్యార్థి పొందాలని తెలిపారు. ఆపార్ కార్డులో విద్యార్థి సమాచారం అంతా అందులో నిక్షిప్తమై ఉంటుందన్నారు. విద్యార్థులంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవండి



రక్తదానం చేసిన వారికి ప్రశంసా పత్రాన్ని అందచేస్తున్న జడ్జి భరత్‌చంద్ర, సీఐ, చైర్మన్

కనిగిరి రూరల్: రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, కనిగిరి కోర్టు జూనియర్ సివిల్ జడ్జి కె.భరత్ చంద్ర అన్నారు. పోలీస్ అమర వీరుల దినోత్సవానికి పురస్కరించుకుని స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. సందర్భంగా మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, కనిగిరి కోర్టు జడ్జి కె.భరత్ చంద్ర రక్తదానం చేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఎక్కువ సార్లు రక్తదానం చేసిన వారికి ప్రశంసాపత్రాలను జడ్జి చేతుల మీదుగా అందచేశారు. ఈ సందర్భంగా జడ్జి కె.భరత్‌చంద్ర మాట్లాడుతూ యువత, విద్యార్థులు రక్తదాన శిబిరంలో ఉత్సాహంగా పాల్గొనడాన్ని కొనియాడారు. సీఐ ఎస్‌కే ఖాజావలి మాట్లాడుతూ పోలీస్ అమర వీరుల త్యాగాలను గూర్చి వివరించారు. మున్సిపల్ చైర్మన్ గఫార్ మాట్లాడుతూ సమాజ రక్షణలో పోలీసుల పాత్ర కీలమన్నారు. ఎస్సైలు, పోలీసులు, యువత, విద్యార్థులు అధిక శాతం మంది రక్తదానం చేశారు. ఎస్సైలు తుళ్లూరు శ్రీరాం, ఎం మాధవరావు, కోటయ్య, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై ఇంటింటి ప్రచారం



హెల్త్ సెంటర్ను తనిఖీ చేస్తున్న జిల్లా ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ వాణిశ్రీ



ముప్పాళ్లలో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య సిబ్బంది

పొన్నలూరు: మండలంలోని ముప్పాళ్ల, వేంపాడు గ్రామాల్లో పొన్నలూరు పీహెచ్‌సీ సిబ్బంది శుక్రవారం సీజనల్ వ్యాధులపై ఇంటింటి ప్రచారం నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కాలనీలో జ్వరం ఉన్న వారిని గుర్తించి వారి రక్త పూతలను స్వీకరించి తాత్కాలిక చికిత్సను అందించారు. అనంతరం వైద్యశాల సూపర్‌వైజర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ సీజన్‌ల వ్యాధులైన డెంగీ, మలేరియా, చికెన్‌గున్యా, మెదడువాపు, ఫైలేరియా వంటి వాధ్యులు సోకకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలని కోరారు. నివాస ప్రాంతాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. దోమలు ప్రవేశించి కుట్టకుండా కిటికీలు, తలుపులకు జాలీలు అమర్చుకోవాలన్నారు. వారంలో ఒక రోజు నీటి నిల్వ పాత్రలను ఎండబెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తర ణ అధికారి సురేష్‌బాబు, ఏఎన్‌ఎమ్, ఆశా కార్యకర్త పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలి

కొండపి: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు వహించాలని జిల్లా ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ వాణిశ్రీ అన్నారు. మండలంలోని పెట్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని వెన్నూరు, చోడవరం, పెద్దకండ్లగుంట కొండపి గ్రామాల్లోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్, హెల్త్ సెంటర్లను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రంలోని ఆరోగ్య సేవలు, రికార్డులు పరిశీలించారు. గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలు, వృద్ధులకు నీటి ద్వారా వ్యాప్తి చెంఏద వ్యాధుల గురించి అవగాహన కల్పించారు. సీజనల్ వ్యాధులు, వాటి నివారణ చర్యల గురించి వివరించారు. పెట్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ అధికారి డాక్టర్ పి.అనూష, ఎంపీహెచ్‌ఈఓ రవిబాబు, హెల్త్ సూపర్‌వైజర్ లక్ష్మీనరసింహం, సీహెచ్‌ఓ, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు, హెల్త్ సిబ్బంది పాల్గొన్నారు.

ఓపెన్‌హౌస్‌పై విద్యార్థులకు అవగాహన



ఓపెన్‌హౌస్‌పై విద్యార్థులకు వివరిస్తున్న పోలీసులు

సీఎస్‌పురం(పామూరు): స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఓపెన్‌హౌస్ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి వచ్చిన సీఎస్‌పురం జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు, కేజీబీవీ విద్యార్థులకు హెడ్‌కానిస్టేబుల్ ప్రసాద్ స్టేషన్ రికార్డుల నిర్వహణ, లాకప్స్ వివరాలు, ఆయుధాలు, పోలీసుల చట్టాలు, అధికారాలు, బాధ్యతలు మొదలైన అంశాలపై విద్యార్థులకు వివరించి క్షేత్రస్థాయిలో విద్యార్థులకు వాటిని చూపించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భూ సమస్యలకు తక్షణ పరిష్కారం



రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ మంజునాథరెడ్డి



శానంపూడిలో అర్జీలు స్వీకరిస్తున్న తహశీల్దార్ రవి

సీఎస్‌పురం(పామూరు): భూ సమస్యలు పరిష్కరించేందుకే రెవెన్యూ గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ మంజునాథరెడ్డి అన్నారు. సమగ్ర భూ రీ సర్వే జరిగిన మండలంలోని బోడావులదిన్నెలో శుక్రవారం రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా బోడావులదిన్నె రెవెన్యూ పరిధిలో గతంలో జరిగిన రీసర్వే వివరాలను గ్రామసభలో వివరించారు. తహసీల్దార్ మాట్లాడుతూ భూముల రీసర్వేతో భూముల విస్తీర్ణం హద్దులు ఏర్పరచి రికార్డుల్లో నమోదు చేసినట్లు తెలిపారు. రైతుల భూములు ఒకరివి మరొకరి పేరుతో నమోదై ఉన్నా, హద్దురాళ్ల ఏర్పాటులో పొరపాటు జరిగి ఉంటే రాతపూర్వకంగా ఫిర్యాదు చేయాలని, వెంటనే పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో సచివాలయ సర్వేయర్, వీఆర్‌ఓ, సిబ్బంది పాల్గొన్నారు.

హనుమంతునిపాడు: గ్రామసభలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ దిలీప్‌కుమార్ అన్నారు. మండలంలోని నల్లగుండ్లలో తహసీల్దార్ దిలీప్‌కుమార్ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల నుంచి 6 అర్జీలు వచ్చినట్లు తెలిపారు. డీటీ కె.కిషోర్‌రెడ్డి, సర్వేయర్ మయణయ్య, వీర్వోఓ బాదుర్ల, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

సింగరాయకొండ: మండలంలోని శానంపూడి గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన గ్రామసభకు 60 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ టి.రవి తెలిపారు. అర్జీలను 15 రోజుల్లో పరిష్కరిస్తామన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిలోనే కాన్పులు చేయించాలి



మాట్లాడుతున్న మెడికల్ ఆఫీసర్ సందీప్

హనుమంతునిపాడు: ప్రభుత్వ ఆస్పత్రిలోనే కాన్పులు జరిగేటట్లు చూడాలని ఏఎన్‌ఎంలకు, సూపర్‌వైజర్లకు, ఎంఎల్‌హెచ్‌పీలకు డాక్టర్ సందీప్ కుమార్ సూచించారు. స్థానిక పీహెచ్‌సీలో శుక్రవారం ఆరోగ్య సిబ్బందికి సెక్టార్ సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ ఆస్పత్రిలో కాన్పులు జరిగితేనే ప్రభుత్వ పారితోషకం అందుతుందన్నారు. పీహెచ్‌సీలు కాన్పులు నిర్వహించేందుకు నర్సులు, అన్ని సదుపాయాలున్నాయని, కాన్పుల శాతాన్ని పెంచాలన్నారు. ఉపకేంద్రాల్లో పనిచేసే ఆరోగ్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి వైద్య సేవలు సక్రమంగా అందించాలన్నారు. సీజనల్ వ్యాధులు సోకుండా ముందస్తు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సీహెచ్ కేవీ చెన్నయ్య, సూపర్‌వైజర్లు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

కోడలు కనిపించడం లేదని ఫిర్యాదు



తన్నీరు అశ్విని ఫైల్

పొన్నలూరు: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం అదృశ్యం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. మండలంలోని పెదవెంకన్నపాలెం గ్రామానికి చెందిన తన్నీరు అశ్వినీ తన భర్త కొండలరావు రెండు నెలల క్రితం చనిపోవడంతో తమ ముగ్గురు ఆడపిల్లలతో కలిసి అత్తగారి ఇంటి దగ్గర ఉంటుంది. ఈ క్రమంలో అశ్విని గురువారం ఉదయం తన పిల్లలను స్థానిక అంగన్‌వాడీ కేంద్రానికి పంపించింది. ఆ తరువాత 10 గంటల సమయంలో అత్తా, మామ ఇద్దరు కూలీ పనికి వెళ్లారు. దీంతో అశ్విని అంగన్‌వాడీ కేంద్ర వద్దకు వెళ్లి తన పిల్లలకు తిను బండారాలు కొనిచ్చి మళ్లీ సెంటర్‌లో వదిలిపెడతానని ఆయాకు చెప్పి పిల్లలను బయటకు తీసుకెళ్లింది. ఈ తరువాత తన పిల్లలను అంగన్‌వాడీ కేంద్రానికి తీసుకు రాలేదు. ఈ క్రమంలో కూలీ పనికి వెళ్లిన అత్తా, మామ సాయంత్రం ఇంటికి రాగా కోడలు, పిల్లలు ఇంటి దగ్గర కనిపించ లేదు. గ్రామంలో విచారించగా అశ్విని తన ముగ్గురు పిల్లలను తీసుకోని ఆటోలో కందుకూరు వైపు వెళ్లినట్లు చూసిన గ్రామస్తులు చెప్పారు. దీంతో రాత్రి అయినా అశ్విని, పిల్లలు ఇంటికి రాకపోవడంతో చుట్టుపక్కల విచారించి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అశ్విని మామ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అనుక్ తెలిపారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి



పొన్నలూరులో పొగాకు నారుమళ్లను పరిశీలిస్తున్న బోర్డు అధికారులు

పొన్నలూరు: పొగాకు నారుమళ్లలో యాజమాన్య పద్ధతులు పాటించాలని కందుకూరు పొగాకు బోర్డు ఒకటో వేలం కేంద్రం వేలం నిర్వాహణాధికారి కిరణ్ అన్నారు. పొన్నలూరులో శుక్రవారం నారుమళ్ల తయారీ, యాజమాన్యం, పొగాకు నాట్లు, విడుపులు, అంతర పంటలు, సస్యరక్షణ, ఎరువులు, నీటి యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నారుమళ్లలో అవసరం మేరకే మందులు వాడాలన్నారు. సీటీఆర్‌ఐ వారు సూచించిన మందులను వాడటం వల్ల పురుగుమందుల అవశేషాలను నివారించవచ్చన్నారు. పొగాకు మొక్కలు నాటేటప్పుడు ట్రే నర్సరీ నారును వాడటం వల్ల విడుపులు తగ్గటంతో పాటు మంచి దిగుబడులు వస్తాయన్నారు. నారుమడులు, ప్రధాన పంటల్లో బంతి, ఆముదం మొక్కలు పెంచడం వల్ల పురుగు పట్టదన్నారు. పొగాకు పంటకు పొటాషియం ఎరువును వాడటం వలన లో గ్రేడ్ పొగాకును నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో ఐటీసీ అధికారులు అవినాష్, శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని యువకుడు హల్‌చల్



రక్తంతో తిరుగుతున్న యువకుడు

సింగరాయకొండ: స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులో శుక్రవారం సాయంత్రం మతిస్థిమితం లేని వ్యక్తి శరీరంపై రక్తంతో హల్‌చల్ చేయడంతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. తరువాత అతనికి మతిస్థిమితం లేదని తెలిసింది. పోలీసుల వివరాల ప్రకారం..తమిళనాడు రాష్ట్రం అరక్కోణంకు చెందిన సతీష్‌కుమార్ టంగుటూరు మండలం వెలగపూడిలోని బంధువుల ఇంటికి శుభకార్యానికి వచ్చి తిరిగి వెళ్లేందుకు రైల్వేస్టేషన్‌కు వచ్చాడు. ఒక్కోసారి ఇతనికి మతిస్థిమితం ఉండదు. ఆ క్రమంలో శుక్రవారం మద్యం మత్తు, మతిస్థిమితం సక్రమంగా లేకపోవడంతో తలను గోడకేసి కొట్టుకున్నాడు. దీంతో రక్తం కారింది. రైల్వేస్టేషన్‌లో యువకుడు రక్తం కారుతున్న శరీరంతో హల్‌చల్ చేస్తున్నాడన్న సమాచారంతో అక్కడికి వచ్చిన హెడ్ కానిస్టేబుల్ భాస్కరలింగం, రమేష్‌లు ఇద్దరు ఆ యువకుడిని 108లో ఒంగోలు పంపించటంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

వాగులకు జల కళ

లింగసముద్రం: ఇటీవల కురిసిన వర్షాలకు వాగులు, వంకల్లో నీరు చేరి జలకళను సంతరించుకున్నాయి. మన్నేరు, ఉప్పుటేరులకు వాగుల నీరు చేరడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ రెండు వాగుల్లో నీరు పారుతుండటంతో బోర్లకింద రైతులు వరినార్లు పోస్తున్నారు. గత సంవత్సరం రాళ్లపాడు ప్రాజెక్టుకు తగినంత నీరు చేరకపోవడంతో మన్నేరు పరీవాహక ప్రాంత గ్రామాల్లో బోర్ల కింద రైతులు వరిసాగు చేయలేదు. ఈ సంవత్సరం ముందుగానే వర్షాలు కురిసి వాగులు పారుతుండటంతో రైతులు వరినార్లు పోస్తున్నారు.

తల్లిదండ్రుల చెంతకు తప్పిపోయిన చిన్నారులు



తప్పిపోయిన పిల్లలను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న ఎస్పీ దామోదర్

ఒంగోలు టౌన్: తప్పిపోయిన చిన్నారులను వెంటనే పట్టుకున్న పోలీసులు వారి తల్లిదండ్రులకు అప్పగించారు. పోలీసుల కథనం ప్రకారం.. సింగరాయకొండ మండలంలో చదువుకుంటున్న ముగ్గురు బాలికలు, ఒక బాలుడు ఇంటి నుంచి అలిగి వెళ్లిపోయారు. సోషల్ మీడియాలో చురుగ్గా ఉంటున్నారని తల్లిదండ్రులు మందలించడంతో మనస్తాపం చెంది ఇళ్లు వదిలి వెళ్లిపోవడం కలకలం సృష్టించింది. ఈ నెల 23వ తేదీ స్కూలుకు వెళ్తున్నట్లు చెప్పి వచ్చిన నలుగురు చిన్నారులు నేరుగా రైల్వేస్టేషన్‌కు చేరుకున్నారు. అక్కడి నుంచి నెల్లూరు, అక్కడి నుంచి తెనాలి, గుంటూరు వెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. దీంతో ఆందోళన చెందిన వారి తల్లిదండ్రులు పిల్లల కోసం చుట్టుపక్కల వెతికారు. కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. గురువారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు.. బృందాలను ఏర్పాటు చేసి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి పిల్లలు గుంటూరు రైల్వేస్టేషన్‌లో ఉన్నట్లు గుర్తించారు. అదే రోజు సాయంత్రం 7 గంటలకు వారిని పట్టుకున్నారు. తప్పిపోయిన పిల్లలను శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో తల్లిదండ్రులకు అప్పగించారు. కేవలం నాలుగు గంటల వ్యవధిలోనే తల్లిదండ్రుల చెంతకు చేర్చడంతో వారు సంతోషం వ్యక్తం చేశారు. సింగరాయకొండ సీఐ హజరత్తయ్య, ఎస్ఐ మహేంద్ర, ఏఎస్ఐలు మహబూబ్ బేగ్, మహబూబ్ బాష, కానిస్టేబుల్ శివకుమారి, అనూషలను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.